




మాట్లాడుతున్న సోమిరెడ్డి, వేదికపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రసన్న, రమేష్‌రెడ్డి, కంభం తదితరులు..
ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తెదేపా నేతలు

# యువగర్జనతో ఎన్నికల శంఖారావం

**నెల్లూరు, న్యూస్‌టుడే:** సింహగర్జన రికార్డును అధిగమించేలా గుంటూరు యువగర్జనను విజయవంతం చేయాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఆ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని యు.పి.ఎ. ప్రభుత్వం ఏక్షణంలోనైనా పార్లమెంటును రద్దు చేసి ఎన్నికలకు వెళ్లే ప్రయత్నాల్లోఉందన్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు జనవరి, ఫిబ్రవరి నెలల్లో రావడం ఖాయమని పేర్కొన్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో పార్టీ నేతలు తమ శక్తియుక్తులన్నింటినీ కూడదీసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గుంటూరులో నవంబరు అయిదోతేదీ జరిగే యువగర్జన సదస్సుతో పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తోందని చెప్పారు. ఆ సదస్సుకు జిల్లా నుంచి 400 పైచిలుకు ఆర్టీసీ బస్సులు బయలుదేరేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఎవరికివారు తమ నియోజకవర్గాల స్థాయిల్లో వాహనాలు ఏర్పాటు చేసుకుని యువగర్జనకు తరలిరావాలని కోరారు. సదస్సు తర్వాత పల్లెనిద్ర, ఓటర్ల నమోదు, సవరణ, సోమశిల జలాల తరలింపు, పెన్నానది ఉపనదులపై నిర్మిస్తున్న ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని శ్రేణులను ఆయన సూచించారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెదేపా విజయం ఖాయమని, అలాగని అతి ఆత్మవిశ్వాసం పనికిరాదన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా కమిటీలు సమష్టిగా పనిచేసి యువగర్జనను జయప్రదం చేయాలని కోరారు. మాజీ మంత్రి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ యువగర్జన జరిగేదాకా నాయకులు నిత్యం గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలను సమీకరించుకోవాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పి.వి.రత్తయ్య, కంభం విజయరామిరెడ్డి, బల్లి దుర్గాప్రసాద్, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, లీగల్‌సెల్ నాయకులు హను మంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాతా నాగేశ్వరరావు, నగర అధ్య క్షులు కిలారి వెంకటస్వామినాయుడు, యువత నాయకులు పమిడి రవికుమార్‌చౌదరి తదితరులు మాట్లాడారు. అంతకు ముందు పార్టీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు బొమ్మన్ సుందరయ్య, చలపతిల మృతికి మౌనం పాటించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు వై.టి.నాయుడు, వేనాటి రామచంద్రారెడ్డి, నువ్వుల మంజుల, బెజవాడ ఓబులురెడ్డి, సుందరరామిరెడ్డి, మురళీమోహన్‌రావు, నెల్లూరురూరల్, వెంకటగిరి కోఆర్డినేటర్లు చిరమన శ్రీనివాసులురెడ్డి, చెలికం శంకర్‌రెడ్డిలు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.